కొనసాగిన పింఛన్ పంపిణీ


అటవీప్రాంతంలోని రేగులపాడు గిరిజనులకు పింఛను పంపిణీ చేస్తున్న దృశ్యం


గంగవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు


పంగిడిగూడెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం


ఆశ్రం ఆసుపత్రికి వెళ్లి గాలీబుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రఫీ

బుట్టాయగూడెం : ప్రతి నెలా పింఛన్ కోసం గత టీడీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు పడేవారు. వృద్ధులు, వికలాంగులు ఎండన పడి నీరసిస్తూ పింఛన్ కోసం ఎదురుచూసేవారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్ అందిస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అర్హులైన లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి ప్రభుత్వ పింఛన్లను వలంటీర్లు అందిస్తున్నారు. మార్చి 1 బుధవారం నాడు పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా రెండో రోజు గురువారం కూడా కొందరు లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఇప్పటివరకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం అర్బన్, కామవరపుకోట, కొయ్యలగూడెం, కుక్కునూరు, పోలవరం, టి.నర్సాపురం మండలాల పరిధిలో సుమారు 68,237 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఎల్‌డీఓ ఎం.రాజు తెలిపారు. మిగిలిన వారికి మరో రెండురోజుల్లో పింఛన్లు పంపిణీ చేసి వంద శాత పింఛన్ల పంపిణీకి కృషి చేస్తామని తెలిపారు.

కొయ్యలగూడెం : పింఛన్ల పంపిణీ కార్యక్రమం రెండోరోజు గురువారం మండల వ్యాప్తంగా కొనసాగించారు. 9,211 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 57 లక్షల 25 వేల పంపిణీ చేశారు. పింఛన్ పంపిణీ 91.19 శాతం పూర్తయిందని ఎంపీడీవో కేఆర్‌ఎస్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. రాజవరం పంచాయతీ గంగవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ కుర్రు నాగబాబుల ఆధ్వర్యంలో వలంటీర్లు పింఛన్‌ను పంపిణీ చేశారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : ఇంటి వద్దకి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంపై లబ్ధిదారులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని పంగిడిగూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, సచివాలయం కన్వీనర్ గంజి వినోద్ అన్నారు. మండలంలోని పంగిడిగూడెంలో వలంటీర్లతో సర్పంచ్, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గురువారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. జంగారెడ్డిగూడెం మండలంలో 8,933 మంది లబ్ధిదారులకు రూ.2,48,72,250 పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు.

లింగపాలెం : లింగపాలెం మండల కొణిజర్ల గ్రామానికి చెందిన మారగాని గాలీబు అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరు ఆశ్రం హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ షేక్ రఫీ గురువారం సుమారు 40 కిలోమీటర్ల దూరం ఉన్న ఆశ్రం హాస్పటల్‌కు వెళ్లి లబ్ధిదారుడు గాలీబుకు పింఛన్ అందజేశాడు.

క్లుప్తంగా

జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా రాజరాజేశ్వరి


కె.రాజరాజేశ్వరి తేజస్వినికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న బార్ కౌన్సిల్ సభ్యులు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా కె.రాజరాజేశ్వరి తేజస్విని నియమితులయ్యారు. ఈ మేరకు ఆ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా బార్‌కౌన్సిల్ సభ్యులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు, కాగా, ఈమెకు ఇదే మొదటి పోస్టింగ్ కావడం గమనార్హం. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఆర్.వరలక్ష్మి, ఇక్కడే సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తూ, సివిల్ కోర్టు జడ్జిగా ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

జంగారెడ్డిగూడెం రూరల్ : జగనన్న గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం లక్కవరం సచివాలయంలో గృహ నిర్మాణ సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న కాలనీలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించామని, రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవన జ్యోతి బీమా చెక్కు అందజేత

కుక్కునూరు : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఖాతాదారులు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా చేయించుకోవాలని ఆ బ్యాంక్ మేనేజర్ దినేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఉప్పేరుకు బ్యాంక్ ఖాతాదారుడైన మేడి రమణ మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్కును అందజేశారు. రమణ జీవనజ్యోతి బీమా చేయించుకోవడంతో ఈ కష్టకాలంలో ఆ కుటుంబానికి బీమా సొమ్ము సాయపడుతుందన్నారు.

లూర్దు మాత ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న క్రైస్తవులు

కామవరపుకోట : తడికలపూడి గ్రామంలో కొండపై ఉన్న లూర్దు మాత పుణ్యక్షేత్రం ఉత్సవాల్లో భాగంగా ఫాదర్ దోమతోటి నతానీయులు ఆధ్వర్యంలో గురువారం మరియ తల్లి విగ్రహాన్ని మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. సిలువమాల ధరించిన భక్తులు ఊరేగింపులో పాల్గొని భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

అలరించిన కాంతార వేషధారణ నృత్యాలు


జీలుగుమిల్లిలో కాంతార వేషధారణలో నృత్యాలు చేస్తున్న కళాకారులు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లిలో కొలువైన జగదాంబ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాల్గవ రోజు గురువారం అమ్మవారి ఉత్సవాల సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా సాయంత్రం కాంతార వేషధారణలో కళాకారులు గ్రామంలో నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చాత్రాతి భవానీ శేఖర్, మాజీ సర్పంచ్ మొడియం రామచంద్రరావు, కక్కిరాల చక్రి, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, కొప్పుల వెంకటేశ్వరరావు, యాంద్ర రఘుబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

టి.నరసాపురం : కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొవ్వూరు కోర్టులో సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న చింతలపూడికి చెందిన దరావతు బాబూరావు గత నెల 28న మోటార్‌సైకిల్‌పై కొవ్వూరు కోర్టుకు వెళుతున్నారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో మండలంలోని వల్లంపట్ల గ్రామ శివారుకు వెళ్లే సరికి ఎదురుగా టి.నరసాపురం వైపు వస్తున్న టాటా ఇండియా విస్టా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబూరావు కుడికాలుకు గాయమైంది. స్థానికులు గాయపడిన వ్యక్తిని జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రెండోరోజు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలో శ్రీవిజయదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు రెండవ రోజు కొనసాగాయి. గురువారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆవాహిత సకల దేవతా హోమములు, శ్రీరుద్ర సహిత చండీహోమం శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 7:22 నిముషాలకు శ్రీశ్రీశ్రీ విజయదుర్గ అమ్మవారు, పంచభూత మరకత లింగేశ్వరస్వామి, తొమ్మిది దేవీదేవతల ప్రతిష్ఠ ఏకకాలంలో జరుగుతాయన్నారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం శ్రీశైవ క్షేత్రము పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామి విచ్చేసి ప్రథమ దర్శనం చేసుకున్న అనంతరం ఉదయం 10.30 నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశామని, భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు. ఉత్సవాల్లో భాగంగా ప్రవచన కర్త బ్రహ్మశ్రీ గొర్తి.సుబ్రహ్మణ్య శాస్త్రిని స్థానిక ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సభ్యులు సత్కరించారు.

నేత్రపర్వం.. శివ కల్యాణం


కల్యాణ ఘడియలో స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల : క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ముందుగా సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం కల్యాణ తంతును ప్రారంభించి, సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను అట్టహాసంగా జరిపి, కల్యాణ మూర్తులకు హారతులిచ్చారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి కూలి పని కల్పిస్తాం


ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

బుట్టాయగూడెం : ఉపాధి కూలీలకు పనిదినాలను పెంచి వారికి సక్రమంగా సొమ్మును చెల్లించేలా కృషి చెయ్యాలని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎస్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ కూలీల సంఖ్య పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలంలో సుమారు 10,550 జాబ్ కార్డులు ఇచ్చినట్లు చెప్పారు. సుమారు 18,853 మంది కూలీలు ఉన్నారని అన్నారు. ప్రస్తుతం కూలీలు ఫారమ్ పండ్స్, చెరువులు, చెక్‌డ్యామ్‌లు, కందకాలు వంటి పనుల్లో పాల్గొంటూ జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ సుమారు 143 మంది 100 రోజుల పనిదినాలను పూర్తి చేసుకుంటున్నారని చెప్పారు. సుమారు 300 మంది 75 రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నారని అన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పనికల్పించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు.

తక్కువ ధరకు సిమెంట్, ఐరన్ ఇస్తానని..

టి.నరసాపురం: మార్కెట్ రేటు కన్నా తక్కువ ధరకు సిమెంట్, ఐరన్ ఇస్తానని పలువురిని నమ్మించి మోసగించిన వ్యక్తిపై టి.నరసాపురం ఎస్సై కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపుగుంటకు చెందిన కొండపల్లి మాధవరావు తనకు సిమెంట్, ఐరన్ కంపెనీల్లో డీలర్‌షిప్ ఉందని, కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటున్న వారి వద్దకు వెళ్లి తక్కువ ధరకు సిమెంట్, ఐరన్ ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి మోసగించేవాడు. ఇలా చింతలపూడి మండలం బట్టువారిగూడేనికి చెందిన అమృతలూరి సుధాకర్ స్వామి అనే శివశక్తి సుధాకర్ స్వామి వద్ద రూ.13 లక్షలు, టి.నరసాపురం మండలం ముత్యాలమ్మ పేటకు చెందిన వేముల సాయి వద్ద రూ.5 లక్షలు తీసుకున్నాడు. వీరే కాక టి.నరసాపురం మండల చుట్టుపక్కల గ్రామాల్లో చాలా మందిని మోసం చేసి డబ్బులు తీసుకుని మాధవరావు పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముమ్మరంగా మొక్కజొన్న ఎగుమతులు


ధర్మాజీగూడెంలో మొక్కజొన్న ఎగుమతి చేస్తున్న దృశ్యం

లింగపాలెం : మెట్టప్రాంతమైన లింగపాలెం మండలంలో మొక్కజొన్న ఎగుమతులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది మండలంలో కమర్షియల్ మొక్కజొన్న సాగును 1,200 ఎకరాల్లోనూ, పాప్‌కార్న్ మొక్కజొన్న పంటను సుమారు 1,498 ఎకరాల్లోనూ రైతులు సాగుచేశారు. అలాగే 4,273 వేల ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రస్తుతం మొక్కజొన్న విరుపులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎండిన మొక్కజొన్న కండెలను ఆరబెట్టి పొలాల్లోనుంచి లారీలకు ఎగుమతులు చేసి ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ప్రతిరోజు మండలం నుంచి సుమారు 25 నుంచి 30 లారీలు, ట్రాక్టర్లలో మొక్కజొన్నలు ఎగుమతి చేస్తున్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత


ప్రగడవరం గ్రామంలో నిర్వహిస్తున్న ర్యాలీ

చింతలపూడి : ఆడపిల్లల సంరక్షణ మన అందరి బాధ్యత అని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ అన్నారు. ప్రగడవరం గ్రామంలో గురువారం బేటీ పడావో, బేటీ బచావో అనే నినాదంపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలమైన ఆడపిల్లలను సంరక్షించుకోవాలన్నారు. బాలికలను సమదృష్టితో చూస్తూ విద్యా, బుద్ధులు నేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌పీ భరత్ కుమార్, నర్మదా రాణి, విష్ణుమూర్తి, పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు. భట్టువారిగూడెం సచివాలయం పరిధిలో యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. బాలికలు అన్నిరంగాల్లో ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని పలువురు పేర్కొన్నారు. భ్రూణ హత్యలు చట్టప్రకారం నేరమన్నారు. పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, ఎంపీ హెచ్ఏ జప్రుల్లా, ఎం.మంగతాయారు. అరుణ, దేవమాత, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన


దేవులపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జంగారెడ్డిగూడెం రూరల్ : దేవులపల్లిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. బొర్రంపాలెం పీహెచ్‌సీ వైద్యులు ఇమాంబి, క్షయవ్యాధి నియంత్రణ పర్యవేక్షకులు ఈ.అంబేడ్కర్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు, తీవ్రమైన జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటివి టీబీ లక్షణాలు అని అన్నారు. ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు మహ్మద్ సుబహాన్ బేగ్, సీహెచ్ కృష్ణవేణి, సీహెచ్‌వో వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ రామాంజనేయులు, హెల్త్ అసిస్టెంట్ సాంబశివరావు, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, ఆశవర్కర్లు అంజలి, రమణి పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు సాధనకై కృషి చేయాలి


ఇమ్మణి రాజేశ్వరి

కొయ్యలగూడెం : మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేసి అన్ని రాజకీయ పార్టీలు మహిళల పట్ల తమ చిత్తశుద్ధి చాటుకోవాలి అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ ఇమ్మణి రాజేశ్వరి పేర్కొన్నారు. గురువారం దిప్పకాయలపాడు గ్రామంలోని ఆమె నివాసంలో సరోజినీ నాయుడు 74వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజినీ నాయుడు మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ ఆమె ఆశయాలు అమలు చేయాలన్నారు. ఏటా మార్చి 8వ తేదీ మహిళా దినోత్సవం అంటూ రాజకీయ పార్టీలు మహిళలను మభ్యపెట్టే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయే కానీ మహిళల అభ్యున్నతికి క్రియాశీలాత్మకమైన రిజర్వేషన్ బిల్లును మాత్రం అమలు చేయడం లేదన్నారు. పార్లమెంటు సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చి అమలు చేయడమే రాజకీయ పార్టీలైనా, ప్రభుత్వాలైనా మహిళలకు ఇచ్చే గౌరవంగా భావిస్తామని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మహిళా రిజర్వేషన్ బిల్లుకై చేపట్టిన ఉద్యమానికి మద్దతిస్తున్నట్లు పేర్కొన్నారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

ద్వారకాతిరుమల: సారా కేసులో ఇటీవల అరెస్టయిన సత్తాల పంచాయతీ సంద్రకుంటకు చెందిన గ్రామ వలంటీర్ పెండ్యాల రామును గురువారం విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్ తెలిపారు. వివరాల ప్రకారం. గ్రామంలో ఈనెల 27న సారా విక్రయిస్తున్న రామును ఎస్ఈబీ అధికారులు పట్టుకుని, అతడి వద్ద నుంచి 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని అరెస్టు చేసి, భీమడోలు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఈబీ ఎస్సై సుబ్బారావు తెలిపారు. ఆ వలంటీర్‌ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం టౌన్, శివారు ప్రాంతాలలో ఐదు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు గవరవరం సబ్‌స్టేషన్ ఏఈ ఎస్.రామారావు గురువారం పేర్కొన్నారు. గవరవరంలో 63 కేవీ, వైఎస్ఆర్ నగర్ 100 కేవీ, చేపలపేట లో 63 కేవీ, దిప్పకాయాలపాడు, అంకాలగూడెంలో 16 కేవీల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని, రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. విద్యుత్ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి కృషి చేయాల్సిందిగా విద్యుత్ శాఖను అభ్యర్థించినట్లు సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు రూ.లక్ష వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ల నిర్మాణానికి అవసరమైన దిమ్మలను పంచాయతీ సొమ్ములతోనే కట్టించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రక్తదానం చేసిన విద్యార్థులు

జంగారెడ్డిగూడెం : స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, ఏలూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్.ఎస్.ప్రసాద్ బాబు ఈ శిబిరాన్ని ప్రారంభించగా కళాశాలలో చదువుతున్న 18 మంది విద్యార్థులు, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు రక్తదానం చేశారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వి.హనుమంతరావు, సభ్యులు డాక్టర్. జి వెంకట్‌లాల్, టి.ఝాన్సీరాణి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

బుట్టాయగూడెం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీయూవీఎస్ మణీంద్రరావు రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. అలాగే కొత్తరక్తం రావడం వల్ల మనిషి ఎంతో ఆరోగ్యంగా చురుగ్గా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మర్రి వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్, ఏలూరు జిల్లా ఆరోగ్యశాఖ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తూకం రాళ్ల తనిఖీ

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏలూరు లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. జీలుగుమిల్లి, కామయ్యపాలెం, దర్భగూడెం, ములగలంపల్లి, అంకంపాలెం, తదితర గ్రామాల్లో చికెన్, మటన్, కిరాణా షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూకం రాళ్ల పరిమాణాలను పరిశీలించారు. అనంతరం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ తమ తనిఖీల్లో చికెన్, మటన్ షాపులకు సంబంధించి 5 కేసులు, ఒక కిరాణాషాపుపై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆరు కాటాలను సీజ్ చేశామన్నారు.

382 లీటర్ల నాటు సారా ధ్వంసం

చింతలపూడి : స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుకున్న 382 లీటర్ల నాటు సారాను గురువారం స్థానిక ఎస్ఈబీ సర్కిల్ కార్యాలయం వద్ద అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమర్ బాబు, సీఐ సాయి స్వరూప్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. సారా తయారు చేసే కేంద్రాల సమాచారం అందచేస్తే దాడులు నిర్వహించి నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ భూమి ఇప్పిస్తానని మోసంపై కేసు

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ భూమి ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేశాడంటూ మాజీ ఆర్మీ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. జంగారెడ్డిగూడెం సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న కోరసిక శ్రీనివాస్ 2008లో ఆర్మీ నుంచి రిటైర్డ్ అయ్యారు. 2014లో కొయ్యలగూడెంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఏలూరి వీరవెంకట సూర్యనారాయణరాజు అనే వ్యక్తి ఇతనికి పరిచమయ్యాడు. ఆర్మీ మాజీ ఉద్యోగులకు ప్రభుత్వం స్థలం ఇస్తుందని శ్రీనివాస్‌కు తెలిపాడు. శ్రీనివాస్, అతని అన్నయ్య, తండ్రి ముగ్గురు ఆర్మీ ఉద్యోగులు కావడంతో డాక్యుమెంట్స్ సూర్యనారాయణరాజుకు ఇచ్చారు. ఈ క్రమంలో వీరి నుంచి రూ.18 లక్షల నగదు తీసుకున్నాడు. ఏడేళ్లయినా భూమి, డాక్యుమెంట్స్, నగదు తిరిగి ఇవ్వలేదని, అడిగితే సూర్యనారాయణరాజు కాలయాపన చేస్తున్నాడు. దీనిపై తమకు న్యాయం చేయాలని ఆర్మీ ఉద్యోగి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసనలు


కొయ్యలగూడెం గణేష్ సెంటర్లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు


జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం రోడ్, గణేష్ గుడి వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ పెరుగుతున్న ఆహార నిత్య అవసరాల ధరలతో ప్రజలు సతమతమవుతుంటే కేంద్ర ప్రభుత్వం మళ్లీ గ్యాస్ ధర పెంచడం అన్యాయమన్నారు. 2014లో కేంద్ర ప్రభుత్వం మోదీ అధికారంలోకి వచ్చిన నాడు గ్యాస్ ధర రూ.450 రూపాయలు ఉంటే ఇప్పుడు రూ.1200 వరకు పెరిగిందనీ విమర్శించారు. మరోపక్క కార్పొరేట్ శక్తులకు విమాన ఇంధన ధరను తగ్గింపు చేశారనీ.. దీనిని బట్టి చూస్తే బీజేపీ ప్రభుత్వానికి సామాన్యుల నడ్డి విరిచి కార్పొరేటర్ శక్తులకు మోకరిల్లడం అలవాటు అయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మోదీ విధానాలను దేశ ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

పెంచిన గ్యాస్‌ధరలు ఉపసంహరించాలి

జంగారెడ్డిగూడెం : కేంద్రం పెంచిన గ్యాస్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి మరోపక్క ఉపాధి అవకాశాలు తగ్గిపోతూ అస్తవ్యస్తంగా ఉన్న జీవన విధానాలను పొయ్యనుంచి పెనంలోకి తోసినట్లుగా గ్యాస్ రేట్లు భారీ స్థాయిలో పెంచడం హేయమైన చర్య అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశభక్తియుత పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయా అధికారి పద్మకు వినతిపత్రం అందజేశారు. ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షులు సరియం రామ్మోహన్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఈ.భూషణం, పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి, పీవైఎల్ జిల్లా నాయకులు తగరం బాబురావు తదితరులు పాల్గొన్నారు.